

www.vibharenews.com

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 12-02-2023 సంపుటి : 04 సంచిక : 149 పేజీలు : 4 వెల : రూ 3-00

# తుర్కియే లాంటి విపత్తుల వేళ.. ఫిజియో ఓ ఆశాకిరణం: మోదీ

దిల్లీ: తుర్కియే సిరియా భూప్రళయం వంటి విపత్తులు సంభవించిన వేళ.. బాధితులు కొత్త జీవితాన్ని తిరిగి ప్రారంభించడంలో ఫిజియోథెరపిస్ట్ ల పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అలాంటి క్లిష్ట సమయాల్లో ఫిజియోలు ఆశాకిరణంగా మారుతారని తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్ జాతీయ సదస్సులో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ జాతీయ సదస్సులో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తుర్కియే



-సిరియా భూకంపం విపత్తును ప్రస్తావించిన ప్రధాని.. "విపత్కర పరిస్థితుల్లో ఫిజియోథెరపిస్ట్ లు బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు. ప్రమాదాలు, విపత్తుల్లో గాయపడినప్పుడు.. వారికి కేవలం శారీరక బాధే మాత్రమే కాదు.. మానసికంగానూ సవాళ్లు ఎదురవుతాయి. అలాంటి సమయంలో బాధితులకు ఫిజియో వైద్యం అందించి శక్తినివ్వడమేగాక.. కొత్త జీవితంపై ఆశను చిగురింపజేయగలరు" అని మోదీ తెలిపారు. ఇక, ఇలాంటి విపత్తుల తర్వాత అధిక సంఖ్యలో ఫిజియోథెరపిస్టుల అవసరం ఉంటుందని ప్రధాని అన్నారు. బాధితులకు మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు వీలుగా ఫిజియెలు 'టెలీ-మెడిసిన్' సదుపాయాన్ని వినియోగించుకోవాలని మోదీ ఈ సందర్భంగా సూచించారు. తుర్కియే, సిరియాలో చోటుచేసుకున్న ఘోర ప్రకృతి విపత్తు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. రెండు దేశాల్లో ఇప్పటివరకు 25వేల మందికి పైగా మరణించగా.. వేల మంది గాయపడ్డారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం..

**9 మంది కార్మికులకు గాయాలు..**



విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 9 మంది కార్మికులకు గాయాల య్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్లాంట్ ఎస్ఎంఎస్-2 వద్ద స్టాగ్ యార్డ్ కన్వేయర్ బెల్ట్ దగ్ధమైనట్లు సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో నలుగురు పర్మినెంట్ ఉద్యోగులు, ఐదుగురు కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురిని స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో శ్రీను, బంగారయ్య, అనిల్ బిశ్వాల్, సూరిబాబు, జై కుమార్ పోతయ్య, ఈశ్వర్ నాయుడు, అప్పలరాజు, సాహు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై విచారణ జరిపి మెరుగైన వైద్యం అందించాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘ నాయకులు కోరారు.

## కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాదం..

నెల్లూరు: జిల్లాలోని కలెక్టరేట్‌లో అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కలెక్టరేట్ వెనుక ఉన్న స్టోర్ రూమ్‌లో శనివారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఫర్నీచర్ కాలిపోయినట్టు సమాచారం. వివరాల ప్రకారం..



నెల్లూరు కలెక్టరేట్ వెనుక వైపు ఉన్న స్టోర్ రూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో స్టోర్ రూమ్ నుంచి దట్టమైన పొగలు కనిపించాయి. అది గమనించిన కలెక్టరేట్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ అధికారులు మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో స్టోర్ రూమ్‌లోని ఫర్నీచర్ కాలిపోయినట్టు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమాదానికి గల కారణలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# చంద్రబాబు ఓ పిరికిపంద: పేర్ని నాని

అమరావతి: విషపు రాతలతో చంద్రబాబు ఒక పుస్తకం అచ్చు వేయించాడని, దానిపై తన పేరు కూడా వేసుకోలేని పిరికిపంద చంద్రబాబు అంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. శనివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "పుస్తకంపై ఎక్కడా టీడీపీ పేరు లేదు. ఇవన్నీ అసత్యపు రాతలు కాబట్టే పేరు వేసుకునే ధైర్యం లేదు. అచ్చెన్నాయుడికి బాడీ తప్ప బుర్ర ఉండదు" అంటూ దుయ్యబట్టారు."వివేకా హత్య సమయంలో ఎవరి ప్రభుత్వం ఉంది?. అప్పుడు మీరేం చేశారు. వివేకా భార్య, కుమార్తె, అల్లుడిని ఎందుకు విచారించలేదు. ఊళ్లో ఉన్న కుటుంబాన్ని ఎందుకు విచారించలేదు?. వివేకా కుమార్తె చెప్పిన అంశాలపై ఎందుకు విచారణ జరపలేదు?. ఎన్టీఆర్ మరణానికి కారణం చంద్రబాబు కదా?. ఎన్టీఆర్ మరణంపై కూడా ఒక పుస్తకం వేయించాలి. కోడెల శివప్రసాద్ మరణంపై సీబీఐ దర్యాప్తు ఎందుకు అడగలేదు. ఇటీవల ఎన్టీఆర్ కుమార్తె మరణంపై పుస్తకం ఎందుకు వేయలేదు" అని పేర్ని నాని ప్రశ్నించారు."అవినాష్‌రెడ్డి సీబీఐకి స్టేట్‌మెంట్ ఇచ్చాడంటూ చంద్రబాబు ఎలా చెబుతాడు?. సీబీఐ దగ్గర అవినాష్ చెప్పిన విషయాలు మీకు ఎలా తెలుసు?. సీబీఐ అధికారుల్లో చంద్రబాబు మనుషులు ఉన్నారా?. చంద్రబాబు డైరెక్షన్‌లో సీబీఐ నడుస్తుందా?. వివేకా హత్యపై టీడీపీ ప్రభుత్వంలో ఎందుకు ఛార్జ్‌షీట్ వేయలేదు?" అంటూ పేర్ని నాని దుయ్యబట్టారు."చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా జగన్‌ను దెబ్బతీయలేరు. రాజకీయాల కోసం ఇంట్లో ఆడవాళ్లను బజారున పెడతావు. సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వకుండా చేసింది ఎవరు?. రాజకీయాల కోసం మహిళలను బజారుకీడ్చే సంస్కృతి చంద్రబాబుది. ఇళ్లలో ఉన్న మహిళల ఫొటోలను పుస్తకంలో వేస్తారా?. మీ ఇంట్లో వారే మహిళలా? వేరే ఇళ్లలో ఉన్నవారు మహిళలు కాదా?. చంద్రబాబుది అతి నీచమైన, దుర్మార్గమైన సంస్కృతి. చంద్రబాబు లాంటి నీచ సంస్కృతి కలిగిన వ్యక్తి ఎక్కడా ఉండడు" అంటూ పేర్ని నాని నిప్పులు చెరిగారు.



# కొత్త పన్ను విధానంతో మధ్య తరగతికి మేలు: నిర్మలా సీతారామన్

దిల్లీ: కొత్త ఆదాయపు పన్ను విధానం వల్ల మధ్య తరగతికి మేలు చేకూరుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. చేతిలో డబ్బులు మిగిల్చే ఉద్దేశంతోనే తీసుకొచ్చినట్లు చెప్పారు. వ్యక్తులు ప్రభుత్వ పథకాల్లోనే పెట్టుబడి పెట్టాలని చెప్పడం లేదని, పెట్టుబడి విషయంలో వ్యక్తులకు స్వేచ్ఛ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బడ్జెట్ (ఃబీటణవబి 2023) అనంతరం ఆర్‌బీఐ బోర్డుతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ గురించి విలేకరులు ప్రశ్నించారు. భారత నియంత్రణ సంస్థల్లో అనుభవజ్ఞులైన వ్యక్తులు, నిపుణులు ఉన్నారని, ఎప్పటిలానే వాటి పని అవి చేస్తున్నాయని చెప్పారు. క్రిప్టో



విషయంలో కామన్ ఫ్రేమ్‌వర్క్ రూపొందించేందుకు జీ20 దేశాలతో చర్చిస్తున్నామని తెలిపారు. ధరల పెరుగుదల గురించి విలేకరులు లేవనెత్తిన ప్రశ్నలపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సమాధానం ఇచ్చారు. ముడి చమురు ధరలు స్థిరంగా ఉంటే 2023-24లో ద్రవ్యోల్బణం 5.3 శాతానికి చేరనుందని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యారెల్ చమురు 95 డాలర్లు ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. మరోవైపు రుణాలు ప్రియం కావడంపైనా స్పందించారు. రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్లు అనేవి పోటీ మార్కెట్ నిర్ణయిస్తుందని చెప్పారు. ఇటీవలి బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో కేంద్రం మార్పులు చేసిన సంగతి తెలిసిందే. రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్నూ ఉండబోదని ప్రకటించింది. రూ.3-6 లక్షలు ఆదాయంపై 5 శాతం; రూ.6-9 లక్షలపై 10 శాతం; రూ.9-12 లక్షలపై 15 శాతం; రూ.12-15 లక్షలపై 20 శాతం; రూ.15 లక్షలపై 30 శాతం పన్ను విధిస్తామని తెలిపింది. అలాగే రూ.7లక్షల వరకు (రిబేట్ అనంతరం) ఎలాంటి పన్నూ ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

# వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజలు కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని వారసిగూడ కూడలి వద్ద స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తానని తన కుటుంబాన్ని బంగారంగా మార్చుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వచ్చే అవకాశమే లేదన్నారు. డబ్బుతో రాజకీయం చేయడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. సికింద్రాబాద్‌లో సరైన రహదారులు, నీళ్లు, నియామకాలు, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, పింఛన్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్య ప్రభుత్వం లేదని, కల్వకుంట్ల అవినీతి పాలన యథేచ్ఛగా సాగుతుందన్నారు. స్థానిక ప్రజల సమస్యలు టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా తెలుసుకొని వారి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోరాటాలు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు.

# ఏపీలో 5 కొత్త మెడికల్ కళాశాలలు

విజయవాడ, ఫిబ్రవరి 11, ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే 5 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆయా కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. రాజమహేంద్రవరం, నంద్యాల, ఏలూరు, విజయనగరం, మచిలీపట్నంలోని వైద్య కళాశాలల నిర్మాణంలో జాతీయ వైద్య మండలి (ఔఓఅ) తనిఖీ బృందం గుర్తించిన లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్య కార్యదర్శి కృష్ణబాబుతో కలిసి ఫిబ్రవరి 10న ఆమె సమీక్షించారు. తరగతుల ప్రారంభానికి తగ్గట్టు నిర్మాణాలను మార్చిలోగా



పూర్తిచేసే బాధ్యత రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ అధికారులదేనని అన్నారు. కళాశాలల్లో 30 శాతంలోపు సిబ్బంది నియామకాలను సత్వరం చేపట్టాలన్నారు. ఫర్నిచర్, పరికరాల కొనుగోలు చర్యలు ముమ్మరం చేయాలని, వీటికి నిధుల కొరత లేదని తెలిపారు. ఈ 5 కొత్త మెడికల్ కళాశాలల్లో 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పనుల్లో జాప్యంపై ప్రశ్నించిన ఎన్ఎంసీ..ఏపీలోని 5 వైద్య కళాశాలల పనుల్లో ఆశించినమేర పురోగతి లేకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) తనిఖీ బృందాలు ప్రశ్నించాయి. సీనియర్ రెసిడెంట్ల కొరతతోపాటు నిర్మాణాల్లో పురోగతి లేకపోవడంపై తనిఖీ బృందాలు రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరాయి. ?పరికరాలు, ఫర్నిచర్ లేకపోవడంపై ప్రశ్నించాయి. ముఖ్యంగా ఐదు జిల్లా ఆసుపత్రులను వైద్య కళాశాలలుగా మార్చాలన్న నిర్ణయం తీసుకునేందుకే వి జయనగరం, రాజమహేంద్రవరం వైద్య కళాశాలల భవనాలు, వసతిగృహాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. మచిలీపట్నం కళాశాల వసతిగృహం, లైబ్రరీ, స్టాఫ్‌రూమ్‌లు, క్వార్టర్స్ నిర్మాణ దశలోనే ఉన్నాయి. ? నంద్యాల కళాశాలలో ప్రీ-పారా క్లినికల్ డిపార్టుమెంట్లు లేవు. మిగిలినవాటితో పోలిస్తే ఏలూరు కళాశాల నిర్మాణం బాగా వెనకబడి ఉంది. మరోవైపు ఈ కళాశాలల్లో 208 పరికరాలను సమకూర్చుకోవాల్సి ఉంది. వీటి కొనుగోలుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఎన్ఎంసీ బృందాలు గుర్తించిన లోపాలను సరిచేస్తూ నిర్మాణాలను మార్చినాటికి పూర్తి చేయాలని గుత్తేదారులను వైద్య ఆరోగ్య శాఖ ఆదేశించింది. తెలంగాణలో మరో ఉద్యోగాల జాతరకు త్వరలోనే సైరన్ మోగనుంది. రాష్ట్రంలో త్వరలోనే 10 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఈ మేరకు అసెంబ్లీలో ఫిబ్రవరి 10న అసెంబ్లీలో ప్రకటించారు. మన ఊరు-మన బడి మొదటిదశ కింద మరమ్మతులు చేపట్టిన 9,123 పాఠశాలలు జూన్ నాటికి సిద్ధమవుతాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు లేరని ఎక్కడా పాఠశాలలు మూసివేయడం లేదన్నారు. భాషా పండితులు, ఇతర సమస్యలు కొన్ని కోర్టుల్లో ఉండటంతో పరిష్కారం కాకుండా నిలిచిపోయాయని పేర్కొన్నారు. 317 జీవో కింద ఇతర జిల్లాలకు వెళ్లిన వారికి ప్రస్తుత బదిలీల్లో పాత జిల్లాల్లో పోస్టింగ్‌లకు అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో ఇకపై నకిలీ సర్టిఫికేట్ల దందాకు చెక్ పడనుంది.

# పోలవరంలో రెండు రకాలుగా ఎన్‌హెచ్‌పీసీ బృందం పరీక్షలు..

అమరావతి: గత సర్కారు నిర్వాకాలతో గోదావరి వరదలకు దెబ్బతిన్న పోలవరం ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్-2 పునాది అయిన డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలు శుక్రవారంతో పూర్తయ్యాయి. ఈ డేటాను ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) బృందం సమగ్రంగా విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ భవితవ్యంపై రెండు వారాల్లోగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ), రాష్ట్ర జలవనరుల శాఖకు నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు డయాఫ్రమ్ వాల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయనుంది. డయాఫ్రమ్ వాల్ పటిష్టంగానే ఉన్నట్లు ఎన్‌హెచ్‌పీసీ తేల్చితే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులకు మార్గం సుగమం అవుతుంది. గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే టీడీపీ సర్కార్ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించింది. గోదావరికి 2019లో భారీ వరదలు రావడం.. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉద్ధృతితో ప్రవహించడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. డయాఫ్రమ్ వాల్ భవితవ్యం తేలితేగానీ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించలేని దుస్థితి నెలకొంది. చంద్రబాబు సర్కారు నిర్వాకాల వల్ల పోలవరం పనుల్లో జాప్యం చోటు చేసుకుంటోంది. డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చే పరీక్షలను నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి పీపీఏ, డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), సీడబ్ల్యూసీ అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లతో చర్చించింది. సీడబ్ల్యూసీ 2022లో చేసిన సూచనల మేరకు ఈ బాధ్యతను ఎన్‌హెచ్‌పీసీకి అప్పగించింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీన నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ఎల్.కపిల్ నేతృత్వంలో జియో ఫిజిక్స్ విభాగంలో నిపుణులైన సంస్థ సీనియర్ మేనేజర్లు ఎ.విపుల్ నాగర్, ఎన్.కె.పాండే, ఎంపీ సింగ్‌లతో కూడిన బృందం పోలవరానికి చేరుకుంది. డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు హై రిజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానం, సెస్మిక్ టోమోగ్రఫీ విధానం ప్రకారం ఒకే సారి పరీక్షలను ప్రారంభించింది. ఇవి తాజాగా పూర్తయ్యాయి. మొత్తం 16 రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహించినట్లుస్పష్టమవుతోంది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందకు ఎన్‌హెచ్‌పీసీ బృందం రెండు రకాల పరీక్షలు నిర్వహించింది. వాటిని ఎలా నిర్వహించారంటే.. హై రిజల్యూషన్ జియో ఫిజికల్ రెసిస్టివిటీ విధానం ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2లో నిర్మించిన 1,750 మీటర్ల డయాఫ్రమ్ వాల్ పొడవునా ప్రతి మీటర్‌కు ఒకచోట 20 మిల్లీమీటర్లు (ఎంఎం) వ్యాసంతో 1.5 అడుగుల లోతుతో వేసిన రంధ్రాల్లోకి ఎలక్ట్రోడ్‌లను పంపి వాటి ద్వారా విద్యుత్ తరంగాలను ప్రసారం చేసి హైరిజల్యూష్ జియో ఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానంలో ఎన్‌హెచ్‌పీసీ బృందం పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల ద్వారా తీసిన 3-డి చిత్రాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చనుంది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌కు ఒక మీటర్ ఎగువన, ఒక మీటర్ దిగువన 60 మి.మీ. వ్యాసంతో 30 నుంచి 40 అడుగుల లోతు వరకూ ప్రతి 40 మీటర్లకు ఒక బోరు బావిని జిగ్ జాగ్ విధానంలో తవ్వారు. అందులోకి ఎలక్ట్రోడ్‌లను పంపి విద్యుత్ తరంగాలను ప్రసారం చేసి పరీక్షలు నిర్వహించారు.

# సంపాదకీయం

ఆదివారం 12-02-2023

## ఇంకా సిరియాలో విదారకరమే

పేకమేడల్లా కూలిన అపార్ట్‌మెంట్లు.. నేలకొరిగిన ఎత్తైన స్తంభాలు.. నిలువునా చీలిన విమానా శ్రయ రన్‌వేలు.. ధ్వంసమైన ఆసుపత్రులు.. వేలకొద్దీ మృతులు, క్షతగాత్రులు.. లక్షల్లో నిరాశ్రయులు.. ఇది కనివిని ఎరుగని భూప్రళయం. భూకంపం వచ్చి 9 రోజులైనా.. ఇంకా టర్కీ, సిరియాలో హృదయ విదారక పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా శిథిలాల దిబ్బలు.. సామూహిక ఖననాలు.. బాధితుల రోదనలు.. వేలాది మంది శిథిలాల కింద సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సహాయక చర్యలు ఎప్పటికి పూర్తవుతాయో తెలీదు. కానీ శిథిలాలను తొలగించే కొద్దీ శవాలు బయటపడుతుంటడం అత్యంత బాధ కలిగిస్తోంది. శిథిలాలను తవ్వేకొద్దీ శవాలు.. అయినవారిని పోగొట్టుకున్న వారి ఆర్తానాదాలతో.. టర్కీ, సిరియాలో పరిస్థితులు భీతావహంగా కనిపిస్తున్నాయి. భూకంపం ప్రభావంతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య గంట గంటకూ.. పెరుగుతూనే ఉంది. ఇప్పటికే 23వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారిక లెక్కలే చెప్తున్నాయి.టర్కీలో 20,213 మంది ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తించారు. మరో 77,711 మందికి పైగా గాయాలయ్యాయి. ఇక సిరియాలో 3,553 మంది మృతి చెందారు. శిథిలాలు తవ్వుతున్నకొద్దీ, బయటపడుతున్న మృతదేహాలను సామూహికంగా సమాధి చేస్తున్నారు. 1990 తర్వాత ఇంత పెద్ద విపత్తు ఇప్పుడే సంభవించింది. భూకంపంతో ఇంతమంది చనిపోవడం 20 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి అంటున్నారు. సహాయక చర్యలు పూర్తయ్యే సరికి ఈ లెక్కలు ఎక్కడివరకూ వెళ్తాయో.. ఇంకెంత మంది ప్రాణాలు పోతాయో అనేది ఊహించడానికి భయం వేస్తోంది.రియాలో సుమారు 5.3మిలియన్ మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులుగా మారారు. టర్కీలోనూ లక్షలాది మంది గూడు కోల్పోయారు. తిండీ, తిప్పలు లేక.. అయిన వారిని పోగొట్టుకుని.. తీవ్ర దుఃఖంలో మునిగిపోయి ఉన్నారు. వారి ధీన స్థితిని చూసి తట్టుకోలేని కొందరు రెస్టారెంటు ఓనర్లు.. ఆహారం అందిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందికీ ఆహారం అందిస్తుంది వారే. నిరాశ్రయులుగా మారిన వారిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు.. అద్దె ఇళ్లను చూపించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాయి అక్కడి ప్రభుత్వాలు.. 2021 ఆగస్టులో దక్షిణ అట్లాంటిక్‌లో వచ్చిన ప్రకంపన తర్వాత అమె రికా భూగర్భ సర్వేక్షణ సంస్థ రికార్డ్ చేసిన ప్రపంచంలోని అతి పెద్ద భూకంపం ఇదే. ఇప్పటికి కనీసం 5 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 6 వేల భవనాలు కుప్పకూలాయి. మరో 11 వేల భవనాల పరిస్థితీ అనధికారికంగా అలానే ఉంది. అంకెలు శరవేగంతో మారుతుండడంతో మృతుల సంఖ్య 10 వేలు దాటినా ఆశ్చర్యం లేదు. బాధితుల సంఖ్య 2.3 కోట్ల దాకా ఉండవచ్చని ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్క. ఇది 21వ శతాబ్దిలోకెల్లా అతి పెద్ద ప్రకృతి వైపరీత్యం అంటున్నది అందుకే. భూఉపరితలానికి దిగువన భూఫలకాల మధ్య ఘర్షణతో భూకంపాలు వస్తాయని లెక్క. ప్రపంచంలో ప్రధానంగా అరేబియన్, యురేషియన్, ఇండియన్, ఆఫ్రికన్, మరో చిన్నదైన అనటోలియన్ భూఫలకాలున్నాయి. మధ్యప్రాచ్యంలో భూకంపాలకు ఇవే కారణం. తాజాగా అనటోలియన్, అరేబి యన్ భూఫలకాల మధ్య 100 కిలోమీటర్ల పైగా దూరం పగులు, ఒరిపిడితో 7.8 రిక్టర్ స్కేల్ స్థాయి భూకంపం టర్కీ, సిరియాలను తాకింది. టర్కీలో చారిత్రక గాజియన్‌టెప్ సమీపంలో జన సమ్మర్ద ప్రాంతంలో భూకంప కేంద్రం నెలకొంది. ఒక పక్క వాన, మరోపక్క చలికాలపు మైనస్ డిగ్రీల అతి శీతల గాలుల్లో సహాయక చర్యలూ కష్టమే. శిథిలాల కింద నుంచి ఆర్తనాదాలు, మూలుగులు వినిపిస్తున్నా వారిని కాపాడే వ్యక్తులు, వసతులు కరవయ్యాయి. కొనవూపిరితో కొట్టుకుంటున్నవారూ చలిలో గడ్డకట్టుకు పోతున్న పరిస్థితుల్లో... వట్టి చేతులతోనైనా శిథిలాలను తవ్వి అయినవాళ్ళను కాపాడుకోవాలన్న విఫల ప్రయత్నాలు సాగుతున్న వేళ... భారత్ సహా 45 దేశాలు మానవతా దృక్పథంతో అత్యవసర సామగ్రితో సాయానికి దిగాయి. యుద్ధంతో, భౌగోళిక రాజకీయాలతో, ఆపైన కరోనాతో, తర్వాత కలరాతో కన్నీట మునిగిన సిరియాకు తాజా భూకంపం దెబ్బ మీద దెబ్బ.. టర్కీ, సిరియా, జోర్డాన్లున్న తూర్పు మధ్యధరా ప్రాంతాన ఆఫ్రికన్, అరేబియన్, యురేషియన్ భూఫలకాల మధ్య సంక్లిష్ట సంబంధాలున్నాయి. అనటోలియన్ బ్లాక్ సరేసరి. అందుకే, టర్కీలో శతాబ్దాలుగా భూవిలయాలు పరిపాటి. అక్కడ 1939 నాటి భూకంపంలో 33 వేల మంది చనిపోయారు. ఈసారి ఈ శతాబ్దిలో కెల్లా బలమైన భూకంప తాకిడితో ఆ దేశం చిగురుటాకులా వణికింది. లోతైన భూకంపాలు సంభ విస్తే వాటి తాకిడి భూ ఉపరితలానికి తాకేసరికి చాలావరకు శక్తి కోల్పోయి, కొంత తక్కువ నష్టం కలిగి స్తాయి. కానీ, లోతు లేని భూకంపాలు శక్తిమంతంగా పైకి తాకి, పెను విధ్వంసం రేపుతాయి.. ఉపరితలం కింద ఒత్తిడి అనూహ్యంగా పేరుకున్న హిమాలయాల్లో ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. భారత్‌లో 59 శాతం ప్రాంతానికి అలా ప్రమాదం పొంచివుంది. టర్కీ ఘటన మనకు మేలుకొలుపు. దీన్నుంచి తక్షణం పాఠాలు నేర్చుకోవాలి.

# అసంతృప్తులు బయటకు రండి...

విజయవాడ, ఫిబ్రవరి 11, ఈ మధ్య కాలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కొత్త తరహా రాజకీయం కనిపిస్తోంది. ఇందుకు కారణాలు కూడా అనేకం ఉన్నాయి. వరుసగా పార్టీలో విభేదాలు బహిర్గతం కావటం, నెల్లూరు వంటి కంచుకోటగా ఉన్న జిల్లాల్లో సైతం అసంతృప్తు స్వరాలు పెరగడంతో అధిష్ఠానం అలర్ట్ అయ్యిందని చెబుతున్నారు. దీంట్లో భాగంగా శాసన సభ్యులు అసంతృప్తులుగా ప్రచారం జరుగుతున్న చోట్ల పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెడుతుంది. అలాంటి శాసన సభ్యులు ఇప్పటికే పలుమార్లు పార్టీ అగ్రనేతలను కలసి పూర్తి తమ వివరణ ఇచ్చారు. అంతే కాదు తమ ఇబ్బందులను కూడా నాయకత్వానికి వివరించారు. అధికార పార్టీ శాసన సభ్యులు అసంతృప్తి పార్టీపై తీవ్ర ప్రభావం పడుతుందని క్యాడర్‌కు కూడా ఇబ్బందులు తప్పవని భావిస్తోంది అధిష్ఠానం. ప్రతిపక్షానికి కూడా అవకాశాలు చేతిలో పెట్టినట్లు అవుతుందని అంచనా వేస్తోంది. అలాంటి నేతలందరికీ విషయంలో ఓ కీలకమయిన ఆదేశం జారీ చేసిందట అధినాయకత్వం. ఫలాన శాసన సభ్యుడు అసంతృప్తిగా ఉన్నారంటూ ప్రచారం జరుగుతుందని పార్టీ అగ్రనాయకత్వానికి తెలిసిందంటే చాలు ఆయా ఎమ్మెల్యేలంతా నెలకు ఒకసారి అయినా ప్రెస్‌మీట్ పెట్టి, వాస్తవాలను గురించి వివరించాలని ఆదేశాలు ఇచ్చిందట. సో ఆయా శాసన సభ్యులు అంతా ఇప్పుడు వరుసగా ప్రెస్ మీట్‌లు పెట్టి మరీ పార్టీ గురించి చెబుతారట. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన శాసన సభ్యుడు కొలుసు పార్ధసారథి గతంలో జరిగిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో పదవి రాకపోవటంతో తీవ్ర అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం ఉంది. పార్టీ నేతలతోపాటుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. అయినా అహనంతో పార్టీలో ఉంటున్నారని, కార్యకలాపాలకు కూడా అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రచారం ఉంది. ఇటీవల పార్ధసారథి తండ్రి మాజీ పార్లమెంట్ సభ్యులు కేపీ.రెడ్డయ్య చనిపోయారు. దీంతో సీఎం జగన్ ఆయన ఇంటికి వెళ్లి రెడ్డయ్యకు నివాళర్పించారు. తర్వాత పార్టీ నుంచి వెళ్లి ఆదేశాల మేరకు ఆయన విజయవాడ కేంద్రంగా మీడియా సమావేశం నిర్వహించి మరీ జగన్ గురించి రముకేశారు. సామాజిక వర్గాలకు న్యాయం చేసింది జగన్ మాత్రమేనని పదే పదే నొక్కి చెప్పారు. అయితే సందర్భంలో లేకుండా ఉన్నపళంగా మీడియా సమావేశం పెట్టి మరీ ఈ విషయాలు చెప్పాల్సిన అవసరం ఏంటని మీడియా అడిగితే నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్‌ది కూడా అదే తీరు. మంత్రి జోగి రమేష్‌తో విభేదాలు కారణంగా దూరంగా ఉంటున్న వసంత కూడా తాజాగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జగన్ బాటలోనే నడుస్తానని ఆయన గతంలో కూడా పదే పదే వివరించారు. అయితే మంత్రి జోగితో మాత్రం విభేదాలు ఉన్న మాట వాస్తవమేనని తెగేసి చెప్పేశారు.ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందని శాసన సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసన సభ్యుడు సామినేని ఉదయ భాను వ్యవహారంలో కూడా ఇదే జరిగింది. గత జనవరి నెలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భువ కుమార్ జన్మదిన వేడుకల్లో వెలంపల్లి శ్రీనివాసరావు, సామినేని ఉదయ భాను ఘర్షణ పడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చూస్తుండగానే ఇద్దరు శాసన సభ్యులు నువ్వెంత అంటే నువ్వెంత అనుకునే వరకు వెళ్లారు. చివరకు మరో ఇద్దరు శాసన సభ్యులు కలసి వారిని పక్కకు తీసుకువెళ్ళారు. ఈ వ్యవహారం పార్టీలో తీవ్ర దుమారాన్ని రాజేసింది. పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న వెలంపల్లి, మరో సీనియర్ శాసన సభ్యుడిని దూషించటం, రాజకీయంగా చర్చనీయాశంకావటం, అందులో కూడా కులాల ప్రస్తావన రావటంతో, పార్టీ నాయకులు సీరియస్ గా తీసుకున్నారు. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టారు. దుర్గ గుడి నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, సామినేని ఉదయ భాను పక్క పక్కనే కుర్చొబెట్టి విభేదాలు లేవనే సందేశాన్ని పంపించారు. ఇలా వరుసగా వివాదాలు ఉన్న శాసన సభ్యులతో మీడియా సమావేశాలు పెట్టించటంతోపాటుగా నేతల మధ్య గ్యాప్ ఉంటే వాటిని వారి చేతనే సరిదిద్దించే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పార్టిలో ప్రచారం జరుగుతుంది.

# మార్చి 17న వైసీపీ అభ్యర్ధుల ఖరారు...?

విజయవాడ, ఫిబ్రవరి 11 ,మార్చి 17 వైసీపీ ప్రజాప్రతినిధులతో సీఎం జగన్ సమావేశం కానున్నారు. ఇప్పటి వరకు వాళ్ల పని తీరుపై ప్రోగ్రెస్ కార్డు ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు ప్రకటిస్తారనే చర్చ తీవ్రంగా నడుస్తోంది. కొన్ని సీట్లలో అభ్యర్థులను కూడా ఖరారు చేస్తారనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు ఆయా నియోజవర్గాల్లో ఇంటింటికీ వెళ్తున్నారు. ఇంకా చాలా మంది వెళ్లడం లేదని ఈ మధ్య జరిగిన సమీక్షల జగన్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పుడు మార్చిలో జరిగే సమావేశంలో వారి ప్రోగ్రెస్ చెప్పనున్నారని తెలుస్తోంది. ఈ సందర్భంగా గెలుపు రేసులో ముందంజలో ఉన్న వారిని అభ్యర్థులుగా ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. మరికొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యర్థుల ఎత్తుగడను బట్టి అభ్యర్థులను ఖరారు చేయబోతున్నట్టు తెలుస్తోంది. అయితే దీన్ని మరికొందరు నేతలు ఖండిస్తున్నారు. జగన్‌కు ముందస్తు ఆలోచన లేదని... పని చేయని వారి ప్లేస్‌లో వేరే వాళ్లను నియమించే ఛాన్స్ ఉందంటున్నారు. పని తీరు బాగోని వారికి నచ్చచెప్పి మారుస్తారని టాక్ వినిపిస్తోంది. అదే టైంలో పక్క చూపులు చూస్తున్న వారి స్థానంలో కూడా కొత్త వారిని తీసుకొస్తారట. అధికార పార్టీలో సీట్లకు డిమాండ్ ఏ స్థాయిలో ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. అందులోనూ వై నాట్ 175 టార్గెట్‌తో ముందుకు వెళుతున్న పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. దీంతో సీట్ల పంచాయితీపై తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. 175 నియోజకవర్గాల్లో దాదాపుగా పాత వారే కంటిన్యూ అవుతారని అధినేత గతంలో గతంలో అనేక సార్లు అనేక వేదికలపై స్పష్టం చేశారు. ప్రధానంగా మంత్రివర్గ విస్తరణలో జగన్ చేసిన వ్యాఖ్యలను కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గుర్తు చేస్తున్నారు. మీ అందరని మరలా చూడాలనుకుంటున్నానని, అందరూ కష్టపడి పని చేస్తే తిరిగి అధికారం మనదే అని జగన్ పిలుపునిచ్చారు. దీంతో దాదాపుగా అందరూ తిరిగి పోటీ చేసే అవకాశం ఉంటుందని భావించారు.అయితే ఎన్నికలకు సంబంధించిన సీజన్ మొదలవటంతో ఊహించని విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో శాసన సభ్యులు రెబల్స్‌గా మారిపోతున్నారు. పార్టీకి చెందిన ఎంపీ రఘురామ రాజు ఎప్పుడో రెబల్ అయ్యారు. అధికార పార్టీని తీవ్ర స్థాయిలో విమర్శించటం, వైఫల్యాలను బయటకు తీసుకురావటంతోపాటుగా అవీనీతి ఆరోపణలు కూడా చేయటం సంచలనంగా మారింది. అయితే కాల క్రమంలో మరింత మంది నేతలు అధికార పక్షానికి వ్యతిరేకంగా బయటకు రావటం చర్చనీయాశంగా మారింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎదురేలేదనుకున్న నెల్లూరు జిల్లాలో వ్యతిరేక రాగాలు వినిపించటం మొదలయ్యాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందిన కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సంచలన కామెంట్స్ చేయటం, ఆయనకు మద్దతుగా మరికొందరు నాయకులు మాట్లాటడటం పార్టీని ఇరుకన పెట్టింది. దీంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, కోటం రెడ్డి వ్యవహారంపై పార్టీ నేతలతో పంచాయితీ చేసి మరి ఎంపీ ఆదాలను రంగంలోకి దించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం వ్యవహారం సంచలనంగా మారటంతో అదే జిల్లా నుంచి ఉదయ గిరి శాసన సభ్యుడు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కూడా పార్టికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటురావటంతో ఆ వ్యవహారం కాస్త పక్కకు వెళ్లింది. అంతర్గతంగా కూడా ఈ వ్యవహారం పార్టీ శాసన సభ్యులపై తీవ్ర ప్రభావం చూపిందని నాయకులు అంటున్నారు.

పార్టీకి చెందిన ముఖ్య నేతలు, శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతోపాటుగా ఇతర నేతల ఫోన్‌లను కూడా ట్యాప్ చేశారనే ప్రచారం మొదలైంది. ఇదంతా ఒక ఎత్తైతే పార్టీలో వారసుల వ్యవహారం కూడా చర్చనీయాశంగా మారింది. ఇప్పటి వరకు ఉన్న శాసన సభ్యుల్లో కొందరు తమ వారసులకు టిక్కెట్‌లను ఇప్పించే అంశంపై జగన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మొదలవటంతో వారసులకు టిక్కెట్‌లను ఇప్పించాలనే నేతలు కూడా కాస్త ఆలోచనలో పడ్డారని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే వారసులకు టిక్కెట్ దక్కకపోతే ఎంచేయాలనే విషయాలను కూడా పార్టీ నేతలు స్వయంగా ఫోన్‌లో మాట్లాడారనే ప్రచారం ఉంది. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వ్యవహారంపై వివాదం నెలకొన్న సమయంలో ఇది నాయకులను గందరగోళానికి గురి చేస్తుందనే టాక్.ఈ పరిస్థితులన్నీ ఇలా ఉంటే మార్చిలో వైఎస్ జగన్ నిర్వహించే సమావేశంలో ఏం చెప్తారు, ఏం చేస్తారనే ఊహాగానాలు చాలానే ఉన్నాయి. సమస్యలేని నియోజక వర్గాల్లో అభ్యర్థులను ప్రకటించే ఛాన్స్ ఉందంటున్నాయి పార్టీ వర్గాలు. ఇంతలో కొందరి ఆశావాహులకు ఎమ్మెల్సీలు ఇచ్చే ఛాన్స్ ఉందంటున్నారు. దీంతో కొందరి అసంతృప్తిని కంట్రోల్ చేసి.. పోటీ చేసే అభ్యర్థులకు లైన్ క్లియర్ చేయవచ్చని వైసీపీ ఆలోచనగా కనిపిస్తోంది.

# రవాణా శాఖలో ఆకాశరామన్న ఉత్తరాలు

నెల్లూరు, ఫిబ్రవరి 11, రవాణా శాఖలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అందరికీ తెలుసు. వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర్నుంచి, డ్రైవింగ్ లైసెన్స్ ల వరకు అన్నింట్లోనూ అవినీతికి ఆస్కారం ఉంది. చేయి తడపనిదే పనికాదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్నిసార్లు నేరుగా ఆఫీస్ కి వెళ్లి పని చేయించుకోవడం కుదరదని దళారీలను ఆశ్రయిస్తుంటారు సామాన్య ప్రజలు. అదే అదనుగా ఆర్టీఏ ఆఫీస్ ల వద్ద తిష్టవేసుకుని ఉండే దళారీలు లోపల కొంతమంది సిబ్బందిని మచ్చిక చేసుకుని తమ పనులు పూర్తి చేసుకుంటుంటారు. చివరకు ఆ భారమంతా ప్రజలపైనే మోపుతారు. లోపల లంచాలు ఇవ్వనిదే పనికాదని చెప్పి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తుంటారు.ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇతర రాష్ట్రాల్లో కొన్న వాహనాలను నెల్లూరుకి తీసుకొచ్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారనే ఫిర్యాదుతో పెద్దస్థాయి అధికారులు బలయ్యారు. ఆ మచ్చ అలా ఉండగానే ఇప్పుడు మరో చిక్కొచ్చి పడింది. పదే పదే నెల్లూరుకి చెందిన సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఆకాశ రామన్న ఉత్తరాలు అందుతున్నాయి. పలానా మోటర్ వెహికల్ ఇన్ స్పెక్టర్లు లంచాలు అడుగుతున్నారని, అసిస్టెంట్ ఎంవీఐలు ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారని, హెడ్ ఆఫీస్ కి ఏజెంట్లు ఫిర్యాదులు చేస్తున్నారు. ఏజెంట్లు తమకు తాముగా ఈ ఫిర్యాదులు చేయకుండా సామాన్య ప్రజల రూపంలో ఆకాశ రామన్న ఉత్తరాలు రాస్తున్నారు. వెబ్ సైట్స్ లో కంప్లయింట్లు పెడుతున్నారు.నెల్లూరుతోపాటు చాలా చోట్ల ఆర్టీఐ ఆపీసుల్లో ఇలాంటి సమస్య ఉంది. ఫిట్ నెస్ సర్టిఫికెట్లను నిర్ణీత సమయంలోగా వాహనదారులు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. అలా రెన్యువల్ చేయించుకోవాలంటే కచ్చితంగా ఇన్సూరెన్స్ తప్పనిసరి. అయితే వాహనదారులు ఇన్సూరెన్స్ చెల్లించడానికి వెనకాడుతుంటారు. ఈ క్రమంలో దళారీలు రంగప్రవేశం చేస్తుంటారు. ఇన్సూరెన్స్ లేకుండానే దానికి పెట్టే ఖర్చులో సగం ఖర్చుతో పనికానిచ్చేస్తామంటూ నమ్మబలుకుతుంటారు. డూప్లికేట్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు చూపించి ఫిట్ నెస్ సర్టిఫికెట్లు తెప్పిస్తుంటారు. ఇటీవల కాలంలో వచ్చిన ఉద్యోగులు దళారీలకు సహకరించడంలేదు. డూప్లికేట్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను వారు వెబ్ సైట్ లో సరిచూస్తున్నారు. వెబ్ సైట్స్ లో ఆయా కంపెనీల ఇన్సూరెన్స్ నెంబర్లతో వాటిని పోల్చి చూస్తున్నారు. ఇన్సూరెన్స్ ఒరిజినల్ కాదు అని తేలితే వెంటనే ఫిట్ నెస్ కి కొర్రీలు పెడుతున్నారు. నిజాయితీగా పనిచేస్తున్న కొంతమంది అధికారులతో దళారీలకు గిట్టుబాటు కావడంలేదు. దీంతో వారు బ్లాక్ మెయిలింగ్ కి పాల్పడుతున్నారు.అధికారులు ఒరిజినల్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లకోసం పట్టుబడుతుండటంతో.. దళారీల ఆటలు సాగడంలేదు. దీంతో వారంతా పై అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఫిట్ నెస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఎంవీఐలు, అసిస్టెంట్ ఎంవీఐలు వేధిస్తున్నారని ఆకాశ రామన్న ఉత్తరాలు రాయిస్తున్నారు. వేర్వేరు ఫోన్లనుంచి టోల్ ఫ్రీ నెంబర్లకు కంప్లయింట్ లు పెడుతున్నారు. దీంతో నిజాయితీగా పనిచేస్తున్న సిబ్బంది తమకెందుకీ కష్టాలంటూ ఇబ్బంది పడుతున్నారు. దళారీలు మానసికంగా వేధిస్తున్నా తాము మాత్రం ఉద్యోగానికి ద్రోహం చేయబోమంటున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్న ఫిర్యాదులు ఇప్పుడు సంచలనంగా మారాయి.

## ఇంకా మైలవరం వైసీపీలో కుమ్ములాటలు

విజయవాడ, ఫిబ్రవరి 11,సీఎం జగన్ పార్టీలో నేతల మధ్య విభేదాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా రాజకీయం హాట్ గా మారిన నేపథ్యంలో అలాంటి పరిస్థితులు ఎక్కడ ఉన్నా నేరుగా ముఖ్యమంత్రే వాటి పరిష్కారంపై శ్రద్ధ చూపిస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయిన నేతలు తన్నులాటకు దిగటంతో క్యాడర్ గందరగోళం ఏర్పడింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే ఇదే నియోజకవర్గంలో సొంత పార్టీకి చెందిన నేతలు గ్రూపులుగా ఏర్పడటంపై జగన్ సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ ఉండగా, అదే నియోజకవర్గంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏకైక మంత్రిగా ఉన్న జోగి రమేశ్ కూడా జోక్యం చేసుకుంటున్నారు. తన పాత నియోజకవర్గం కావటం, తన తండ్రి ఇతర కుటుంబ సభ్యులు సైతం అదే నియోజకవర్గంలో పార్టీ కోసం ఆవిర్భావం నుంచి కష్టపడటంతో జోగి రమేశ్ మైలవరం నియోజకవర్గం వైపు మనసు పెట్టుకున్నారు. దీంతో అక్కడ జోగి రమేశ్ వర్గం ఒకటి ఏర్పడి, స్థానిక శాసన సభ్యుడిగా ఉన్న వసంత కృష్ణప్రసాద్ కు వ్యతిరేకంగా పనిచేయటం మొదలుపెట్టింది. ఇది వసంతకు ఇబ్బందిగా మారింది. ఒకే పార్టీలో ఉండి కూడా స్థానిక శాసనసభ్యుడికి వ్యతిరేకంగా కార్యకలాపాలు చేపట్టటం, అదే సమయంలో జోగికి మంత్రి పదవి రావడంతో వసంత అవమానంగా భావించారు. మైలవరంలో మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మధ్య విభేదాలపై ఇరువురు నేతలు బాహాటంగానే కామెంట్స్ చేసుకున్నారు. అయితే ఈ వ్యవహారంపై పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి పంచాయితీ కూడా చేశారు. అయినా ఇరువురు నేతలు తమ వైఖరిని మార్చుకోలేదు. దీంతో ఈ వ్యవహారాన్ని కృష్ణా, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ గా ఉన్న మర్రి రాజశేఖర్ వద్దకు చేర్చారు. అయినా అక్కడ పంచాయితీ తెగలేదు. చివరకు ముఖ్యమంత్రి జగన్ నేరుగా జోక్యం చేసుకున్నారు. మైలవరంలో నీకేంటి పని అంటూ మంత్రి జోగి రమేశ్ ను జగన్ ను ప్రశ్నించారని, ఎవరి నియోజకవర్గాల్లో వారు పని చేయాలని తెగేసి చెప్పటంతో వ్యవహారం కొలిక్కి వచ్చిందని నేతలు అంటున్నారు. ముఖ్యమంత్రి జోక్యంతో ఈ వివాదం సమసిపోయిందని ఎవరి పనివారు చేసుకుంటామని వసంత వెల్లడించారు. అంతే కాదు తాను ఎప్పటికీ జగన్ వెంటే ఉంటానని క్లారటీ ఇచ్చారు. గతంలో తాను పార్టీ మారుతున్నానని అనేక రకాలుగా తప్పుడు ప్రచారాలు చేశారని అన్నారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలతో తనకు ముడిపెట్టి, పార్టీలో ఉన్నా కోవర్ట్ గా ముద్ర వేసేందుకు ప్రయత్నం జరిగిందని, అయితే ఈ విషయంపై జగన్ కు అన్ని వివరాలను అందించి, జరిగిన వ్యవహారాలు అన్ని ఆయనకు వివరించటంతో సమస్య పరిష్కారం అయ్యిందని వసంత స్పష్టం చేశారు. ఇకనైనా ఇద్దరు నేతలు వివాదాల విడిచిపెట్టి పార్టీ కోసం పనిచేస్తారో లేదో వేచిచూడాలి.

## ముందస్తుపై టీడీపీ వ్యూహాలు

విజయవాడ, ఫిబ్రవరి 11 ఆంధ్రప్రదేశ్ లో ముందస్తు ఎన్నికలు ఖాయమని తెలుగుదేశం పార్టీ గట్టిగా నమ్ముతోంది. ఆ పార్టీ వ్యూహ కమిటీ భేటీలో ఈ మేరకు తీర్మానించేసుకుని ఎన్నికల సన్నాహాలు కూడా ప్రారంభించాలని డిసైడయ్యారు. ముందస్తు ఉండదన్న నమ్మకంతోనే లోకేష్ వచ్చే ఎన్నికల వరకూ పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ ఇప్పుడు మాత్రం ఖాయమని నమ్ముతున్నారు. టీడీపీకి అందిన సమాచారం ఏమిటి ? వైఎస్ఆర్‌సీపీ అదే ఆలోచనల్లో ఉందా ?ముందస్తు ఎన్నికల విషయంలో టీడీపీ చాలా నమ్మకంగా ఉంది. ప్రభుత్వం ఆర్థిక సమస్యల్లో ఇరుక్కుపోయిందని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అప్పుల భారం మరింత ఎక్కువ అవుతుందని.. తీసుకున్న రుణాల చెల్లింపులకు వచ్చే ఆదాయం సరి పోదని.. అదే సమయంలో జీతాలు, బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కొత్త అప్పుల కోసం కేంద్రం అనుమతి ఇస్తుంది. ఆ అప్పులకు సంబంధించి ఆర్బీఐ వద్ద నాలుగైదు నెలల్లో మొత్తం తీసుకుని పథకాలకు నిధులు పంపిణీ చేసి ఎన్నికలకు వెళ్తారని టీడీపీ వ్యూహకర్తలు ఓ అంచనాకు వచ్చినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గా లను ఐదు జోన్లుగా విభజించి ముందస్తు ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని టీడీపీ నిర్ణయానికి వచ్చింది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడంలో భా గంగా ప్రతి 35 నియోజకవర్గాలను ఒక జోన్‌గా విభజించాలని నిర్ణయించారు. అలాగే జోన్ల వారీ గా సమావేశాన్ని కూడా నిర్వహించే తేదీలను కూడా ఖరారు చేశారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఐదు రోజుల పాటు జోన్ల వారీ సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ సమా వేశాల్లో చంద్రబాబు స్వయంగా పాల్గొం టారు. 21న కడపలో, 22న నెల్లూరులో, 23న అమరావతి లో, 24న ఏలూరులో, 25న వి శాఖలో పార్టీ జోన్ సమావేశాలు ఉంటాయి.నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అవలంభించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై జోన్ల సమావేశాల్లో చంద్రబాబు స్పష్టత ఇస్తారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్ర జల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. అధికార పార్టీ లో దాదాపు 75 మంది ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లుగా టీడీపీ హైకమాండ్ ఓ అంచనాకు వచ్చింది. దీంతో ముందే సీఎం జగన్ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ..టీడీపీకి కి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్న నేతలందరూ ప్రజల్లోనే ఉండాలని ఆదేశించారు. జోన్ల వారీ సమావేశాల్లో నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, ముఖ్యనేతలు, క్లస్టర్ ఇంఛార్జ్‌లు, డివిజన్ ఇంఛార్జ్‌లు హాజరవనున్నారు. ముందస్తు ఖాయమనుకుంటున్న తెలుగుదేశం లోకేష్ పాదయాత్ర విషయంలో మాత్రం క్లారిటీగానే ఉంది. సీఎం జగన్ అధికారికంగా అసెంబ్లీని రద్దు చేసే చివరి క్షణం వరకూ పాదయాత్ర కొనసాగుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత పరిస్థితిని బట్టి పాదయాత్ర పై నిర్ణయం తీసుకుంటామని అంటున్నారు. ప్రజల్లో గ్రాఫ్ పడిపోవ డంతో పల్లె నిద్రలు, బస్సు యాత్రల పేరుతో జగన్ ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నారని టీడీపీ నమ్ముతోంది.

## ప్రకాశం జిల్లా వైసీపీలో లుకలుకలు

చీరాల, ఫిబ్రవరి 11, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు. సొంత పార్టీ నేతలతోనే ఎమ్మెల్యేకు పడటం లేదు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నేనే రాజు.. నేనే మంత్రి అంటూ వ్యవహరిస్తున్నారనేది వైసీపీ ద్వితీయశ్రేణి నేతల ఆరోపణ. గుంటూరు జిల్లాకు చెందిన సుధాకర్‌బాబు గత ఎన్నికల సమయంలో సంతనూతలపాడు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. మొదట్లో అంతా బాగానే ఉన్నా తర్వాత సొంత పార్టీ నేతలతో గ్యాప్ వచ్చింది. తమకు ఓ మాట కూడా చెప్పకుండా ఎమ్మెల్యే ఇష్టారీతిన అధికారులను బదిలీ చేస్తున్నారని.. నచ్చిన వారికి పనులు కేటాయిస్తున్నారని విమర్శలు వచ్చాయి. ఆ సమస్యను ఎమ్మెల్యే సరిచేసుకోక పోవటంతో గ్యాప్ పెద్దదైంది. తాజగా నాగులుప్పలపాడులోని కమ్మ సామాజికవర్గ నేతలు డేంజర్ బెల్స్ మోగించారు.ఎమ్మెల్యే తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కమ్మ సామాజికవర్గ నేతలు ప్రత్యేకంగా మీటింగ్ పెట్టుకుని మరీ అసంతృప్తి వెళ్లగక్కారు. నాగులుప్పలపాడులో కమ్మ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. మొదట్లో కాంగ్రెస్‌కు ఆ తర్వాత వైసీపీకి వాళ్లంతా జైకొట్టారు. గతంలో సుధాకర్‌బాబుతో ఏ సమస్య వచ్చినా వాళ్లంతా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనేవారు. బాలినేని పరిధి నుంచి ప్రకాశం, బాపట్ల జిల్లాలను తప్పించడంతో వారి పరిస్థితి ఇరకాటంలో పడింది. ఎమ్మెల్యేతో ఉన్న గొడవలు ఇంకా పెరిగి పెద్దవైనట్టు తెలుస్తోంది. తనకు నచ్చిన వారిని ఒకలా.. నచ్చకపోతే మరోలా ట్రీట్ చేస్తున్నారని సుధాకర్‌బాబుపై ఫైర్ అవుతున్నారు వైసీపీలోని కమ్మ సామాజికవర్గం నేతలు. ఈ అంశంపై గడిచిన నెలలోనే రెండుసార్లు సమావేశాలు పెట్టుకున్నారట.రహస్య సమావేశాల గురించి ఉప్పందడంతో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అసంతృప్త నేతలను బుజ్జగించే ప్రయత్నం చేశారట. అయితే అవేమీ వర్కవుట్ కాలేదని సమాచారం. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి నాగులుప్పలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కమ్మ సామాజికవర్గ ముఖ్య నేతలు హాజరయ్యారట. ఇకపై తమకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించుకునేందుకు సమన్వయ కమిటీ కూడా ఏర్పాటు చేసుకున్నారట. ఆ కమిటీలో మండలానికి ముగ్గురు చొప్పున 12 మందిని నియమించారట. త్వరలో మాజీ మంత్రి బాలినేని దగ్గరకు వెళ్లి తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఏకరవు పెట్టాలని తీర్మానం చేసినట్టు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ నాగులుప్పలపాడులోనే మరో సామాజికవర్గ నేతలతో ఉన్నతగవులతో ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు తలబొప్పి కట్టింది .చివరకు బతిమాలో.. బామాలో.. బుజ్జగించో వారితో కుదిరి.. కుదరని ఓ సయోధ్య కుదుర్చుకున్నారట. దానిపై చర్చ జరుగుతున్న సమయంలోనే ఇప్పుడు కొత్త జగడం పార్టీ వర్గాల్లో కలకలం రేపుతోంది. ప్రస్తుతం బాల్ బాలినేని కోర్టుకు వెళ్లనుండటంతో.. మాజీ మంత్రి ఏం చేస్తారు? అసంతృప్త నేతలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచిస్తారా? దానికి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అంగీకరిస్తారా? అనేది ప్రశ్న.

## టీడీపీ, జనసేన ఆశావహుల మధ్య కోల్డ్‌వార్

కాకినాడ, ఫిబ్రవరి 11, విలక్షణ తీర్పులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే నియోజకవర్గం తాడేపల్లిగూడెంలో రాజకీయం ఆసక్తిగా మారుతోంది. పొత్తు ఉంటుందో లేదో తేలక టీడీపీ, జనసేన ఆశావహుల మధ్య కోల్డ్‌వార్ పీక్స్‌కు చేరింది. పొత్తు పొడిస్తే పోటీలో ఉండేది ఎవరు? పొత్తు లేకుండా గెలిచేది ఎవరనే లెక్కలేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఐదు పార్టీలు గెలిచాయి. టీడీపీ నాలుగుసార్లు.. కాంగ్రెస్, ప్రజారాజ్యం, బీజేపీ, వైసీపీలో ఒక్కోసారి ఈ సీటును తమ ఖాతాలో వేసుకున్నాయి. 1999 నుంచి వరుసగా టిడిపి, కాంగ్రెస్, ప్రజారాజ్యం, బీజేపీ, వైసీపీ గెలుస్తూ వచ్చాయి. ఇదే సెంటిమెంటు వచ్చే ఎన్నికల్లోనూ రిపీట్ అవుతుందని భావిస్తోంది జనసేన. గత ఎన్నికల్లో 36 వేల ఓట్లు సాధించిన జనసేన అభ్యర్ధి బొలిశెట్టి శ్రీనివాస్ మూడో స్థానంలో నిలిచారు. టిడిపి నుంచి పోటీ చేసిన ఈలి నానికి 54వేల ఓట్లు వచ్చాయి. ఆ ఓటమి తర్వాత ఈలి నాని పార్టీ కార్యక్రమాలకు దూరం కావడంతో వలవల బాబ్జి టీడీపీ కన్వీనర్‌గా ఉన్నారు. గత ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేసిన టిడిపి, జనసేనలు వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ చేస్తే అవకాశం దక్కేది ఎవరికని రెండు పార్టీల్లో స్థానికంగా చర్చ జరుగుతోంది.2014లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి బరిలో దిగడంతో బీజేపీ అభ్యర్థి పైడికొండల మాణిక్యాలరావు గెలిచారు. వచ్చే ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేయకపోతే వైసీపీని ఓడించడం కష్టమనేది ఇక్కడ రెండు పార్టీ నేతల మాట. అయితే జనసేన నుంచి బొలిశెట్టి, టీడీపీ నుంచి వలవల బాబ్జి ఇద్దరూ పోటీ చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. వీరిలో ఎవరికి బరిలో ఉండే అవకాశం దక్కినా రెండోవారు సహకరిస్తారా అనేది అనుమానమే. గత ఎన్నికల్లో ఓడిపోవడంతో బొలిశెట్టికి సెంటిమెంట్ కలిసి వస్తుందని జనసేన వర్గాలు భావిస్తున్నాయట. టీడీపీ కంటే స్పీడ్‌గా నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపడుతున్నారనే వాదన జనసేన వర్గాల్లో ఉందట. పొత్తు పొడిస్తే ఎవరు పోటీ చేస్తారు.. ఎవరు త్యాగం చేస్తారన్నది కూడా ప్రశ్నే. దీనిపైనే తాడేపల్లిగూడెంలో చర్చ సాగుతోంది.

## కోరమండల్ చే నిత్యవసర సరుకులు పంపిణీ

కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్బు అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతి నెల రెండో శనివారం ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ త్యాగాన్ని మించిన ధనం, దానాన్ని మించిన గుణం లోకంలో లేదన్నారు. ఆ దిశగా కోరమండల్ మహిళా క్లబ్ పలు సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమని అన్నారు. సమాజ సేవను సామాజిక బాధ్యతగా చేపట్టి ఇటీవల గైగోలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ లను కూడా పంపిణీ చేయడం అభినందనీయమని పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ సృజన, అంజుమ్, రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్ ,చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రెండింగ్ గా మారుతున్న సైటైర్లు

విజయవాడ, ఫిబ్రవరి 11, (న్యూస్ పల్స్)నువ్వే మా నమ్మకం అంటూ జనాల్లోకి వెళ్లాలని వైసీపీ ప్లాన్ చేస్తుంటే దానికి కౌంటర్‌గా ప్రతిపక్షాలు రోడ్లపైకి వస్తున్నారు. వైసీపీ కార్యక్రమంలో మొదలు కాక ముందే జనసేన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాకు నమ్మకం లేదు దొర అంటూ సరికొత్త ప్రచారానికి తెరలేపింది. నువ్వే మా నమ్మకం జగన్ అంటూ వైసీపీ చేయబోతున్న ప్రచారంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారులను బెదిరించడానికి ఓట్లు వేయించుకోవడానికి ప్రభుత్వం డబ్బులతో వైసీపీ ప్రచారం చేసుకుంటుందని ఆరోపిస్తోంది జనసేన. ఈ ప్రచారంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. అంతే కాకుండా దీనికి పోటీగా కార్యక్రమాన్నికూడా చేపట్టింది. మాకు నమ్మకం లేదు దొర అనే ట్యాగ్‌లైన్‌తో నువ్వు మా దరిద్రం జగన్ అంటూ ప్రచారానికి తెలేపింది. నిన్ను నమ్మలేం జగన్ అంటూ నినదించారు జనసేన నాయకులు. గుంటూరులో జరిగిన కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి ఈ స్టిక్కర్‌ను విడుదల చేశారు. వైసీపీ స్టిక్కర్ కార్యక్రమాన్ని ప్రారంభించక ముందే జనసేన తమ ప్లాన్ వర్కౌట్ చేస్తోంది. ఇంటింటికీ వెళ్లీ... మాకు నమ్మకం లేదు దొర స్టిక్కర్లు అంతికించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ మధ్య కాలంలోనే వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే ఆర్బీఐ నుంచి తెచ్చిన రూ. 55, 555 కోట్ల అప్పు లెక్కలు విడుదలైన సందర్భంగా.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ .. సీఎం జగన్ పై సెటైర్ వేశారు. ఆయనకు అప్పు రత్న అవార్డు వచ్చినట్లుగా అధికారులు ఆయనకు ఓ మెమెంటోను తెచ్చి ఇస్తున్నట్లుగా కర్టూన్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేశారు. పక్కనున్న మరో అధికారి అది భారతరత్న లాంటి గొప్ప అవార్డు అని చెబుతూండటం మరింత సెటైరిక్‌గా ఉంది. ఈ కార్టూన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ కార్టూన్ ను సోషల్ మీడియాలో పంచుకుంటూ పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మీ వ్యక్తిగత ఆస్తులను పెంచుకునే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. అదే సమయంలో రాష్ట్ర, ప్రజల ఆస్తులను కుక్కలకు వదిలేయాలని .. కానీ వ్యక్తిగత ఆస్తులను భద్రంగా చూసుకుంటారన్నారు. అదే అది సీఎం స్పిరిట్ అని.. సెటైర్ వేసారు. జనసేనానికి చాలా కాలంగా.. సీఎం జగన్ పై ఈ తరహా సెటైర్లు కార్టూన్ల రూపంలో వేస్తున్నారు. ఓ కేబినెట్ మీటింగ్‌లో ఎన్నికలు వస్తున్నందున మంత్రులందరూ అవినీతికి దూరంగా ఉండాలని జగన్ సూచించినట్లుగా వార్తలు వచ్చాయి.దానిపై కార్టూన్ పోస్ చేసి.. అవినీతికి క్రాప్ హాలీడ్ ప్రకటించడం సంతోషమని సెటైర్ వేసారు. పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో స్పందించేది తక్కువే. ఎక్కువ సందర్భాల్లో పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ఇస్తారు. కీలకమైన అంశాలపై విమర్శలు చేయాలంటే ..తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసారు. పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో ఏ అప్ డేట్ ఇచ్చినప్పటికీ.. సంచలనంగా మారుతూ ఉంటుంది. వైరల్ అవుతుంది. ఇలాంటి సెటైరిక్ కౌంటర్లు ఇచ్చినప్పుడు జనసైనికులు మరింతగా ఉత్సాహంగా వాటిని వైరల్ చేస్తూ ఉంటారు.

# మా నమ్మకం నువ్వే జగన్

విశాఖపట్నం జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహ సారధులు (జేసీయస్) శిక్షణా కార్యక్రమం జగదాంబ జంక్షన్, అంబికాబాగ్ కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిధిగా విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ గారు పాల్గోన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమం ప్రతీ కుటుంభానికి తెలియచేసే బాధ్యత ప్రతీ ఒక్క గృహసారధి, సచివాలయం కన్వీనర్, వాలంటీర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరిపై వుందని అన్నారు.అనేక సమస్యలను ఎదురొడ్డి పార్టీ అధినేత వైయస్ జగన్ అనేకానేక వడిదుడుకులు ఎదుర్కొని ప్రతిపక్ష నేతగా ఆనాడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రజా సంకల్ప పాద యాత్ర ద్వారా 3648 కిలోమీటర్లు నడిచారు. ఎన్నికల్లో విజయం సాధించగానే అర్హులు అయిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి అన్న ధ్యేయంతో వాలంటీర్, సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి వాటి ద్వారా రాష్ట్రంలో అర్హులు అయిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగన్ ఎమ్మెల్యే తెలిపారు.వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కృషి చేసి వచ్చే 2024 సాదారణ ఎన్నికల్లో మళ్లీ సీఎం వైయస్ జగన్ గారు గెలుపే లక్ష్యంగా పని చేయాలి అని అందరికీ పిలుపు ఇచ్చారు. అలానే మన నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ఒక్కతాటిపై నడిపించి ప్రజందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తూ పార్టీని ప్రజల్లో మరింత చేరువ చేసే గొప్ప నాయకత్వం కలిగిన ఎమ్మెల్యే వాసుపల్లి గారు ఈ నియోజకవర్గంలో ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అని తెలిపారు. కావున ఎమ్మెల్యే గారిని వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి వైయస్ జగన్ గారిని మళ్లీ సీఎం గా గెలిపించుకోవాలని అందుకు మీరంతా కలిసి బాధ్యత తీసుకోవాలి అని మీ అందరితో కలిసి తాను పని చేసి వచ్చే ఎన్నికల్లో మన పార్టీ ఘన విజయం సాధించకోవడం కొరకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు.

# ఉగ్రవాదానికి తావు లేదు

హైదరాబాద్, ఫిబ్రవరి 11, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమిలో 74 ఆర్ఆర్ ఐపీఎస్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.స్వాతంత్ర్యానంతరం అఖిల భారత సర్వీసులను ప్రారంభించిన సమయంలో దేశ తొలి హోంమంత్రి సర్దార్ పటేల్ ఫెడరల్ రాజ్యాంగం కింద దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అఖిల భారత సర్వీసులపై ఉందని చెప్పారన్నారు. ఈ వాక్యాలు మీ జీవితాంతం గుర్తు పెట్టుకోవాలన్నారు. 7 దశాబ్దాలుగా అంతర్గత భద్రత రంగంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నామని, ఈ పరిస్థితుల్లో 36 వేల మంది పోలీసులు అమరులయ్యారని హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానంపై పని చేశామని అమిత్ షా చెప్పారు. దీంతో టెర్రరిస్ట్ ఫండింగ్ పై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేసిందన్నారు. అమిత్ షా తన ప్రసంగంలో వామపక్ష తీవ్రవాదాన్ని ప్రస్తావించారు. వామపక్ష తీవ్రవాదాన్ని కూడా ప్రభుత్వం నియంత్రించిందని కేంద్ర హోం మంత్రి చెప్పారు. పీఎఫ్ఐ అంశాన్ని అమిత్‌షా ఉదహరించారు. పీఎఫ్ఐని నిషేధించడం ద్వారా ఇలాంటి సంస్థలకు హెచ్చరికక ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'నవ భారతం'లో హింసకు, వామపక్ష తీవ్రవాద భావాలకు తావులేదని అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వామపక్ష తీవ్రవాదాన్ని, ఎలాంటి హింసనైనా సహించే ప్రసక్తి లేదని అలాంటి విధానాన్ని మోదీ ప్రభుత్వం రూపొందించిందన్నారు.దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారిగా 2022లో నక్సల్స్ ఘటనల్లో 100 మంది కంటే తక్కువ మంది పౌరులు, భద్రతా దళాల సిబ్బంది మరణించారని, 2010తో పోలిస్తే 2022 వరకు వామపక్ష తీవ్రవాద ఘటనలు 76 శాతం తగ్గాయని హోం మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో చెప్పారు.

# స్ట్రాటజీతోనే పాదయాత్రకు ప్రచారం

తిరుపతి, ఫిబ్రవరి 11, తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి దాదాపుగా రెండు వారాలు అవుతోంది. దాదాపుగా ప్రతీ రోజూ పోలీసులతో పెనుగులాట జరుగుతూనే ఉంది. ఆయనను మాట్లాడనివ్వడం లేదు. అయితే బహిరంగసభల్లో మాట్లాడుకోవాలి లేకపోతే.. మాట్లాడవద్దని పోలీసులు స్పష్టంగా చెబుతున్నారు. ఏ రూల్ ప్రకారం అలా అంటున్నారని టీడీపీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పోలీసులు అడ్డుకుంటున్నారని.. వాహనం ఎక్కనివ్వడం లేదని.. ఆయన గ్రామాల్లో స్టూల్ లాంటి దాని మీద నిలబడినా ఒప్పుకోవడం లేదు. దీంతో లోకేష్ పాదయాత్ర విషయంలో ప్రభుత్వం భయపడుతోందని అందుకే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. కొద్ది రోజుల కిందట కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఏపీ మీదుగా భారత్ జోడో యాత్ర చేశారు. ఆయన పాదయాత్రకు పోలీసుల అనుమతి తీసుకున్నారో లేదో స్పష్టత లేదు కానీ .. ఎలాంటి వివాదమూ ఏర్పడలేదు. అనుమతులు అనే చర్చ జరగలేదు. పాదయాత్ర జరిగింది. ఉదయం, సాయంత్రం పలు వర్గాలతో భేటీ అయ్యారు. స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఇంకా కాస్త వెనక్కి వెళ్తే ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారు ఆయనకు మైక్ ఉన్న వాహనం వెంట ఉండేది. ఎప్పుడు కావాలంటే అప్పుడు మాట్లాడేవారు. ఎవరూ అడ్డు చెప్పలేదు. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న పాదయాత్రల్లోనూ ఎలాంటి ఆంక్షలు.. ఆటంకాలు లేవు. కానీ విచిత్రంగా ఒక్క లోకేష్ పాదయాత్ర విషయంలో పోలీసులు ఎక్కువగా ఆంక్షలు పెడుతున్నారు. భద్రతకు ఇరవై మంది.. అడ్డుకోవడానికి వెయ్యి మందిని పెట్టారని టీడీపీ నేతలంటున్నారు. చిన్న చిన్న పల్లెల్లో కూడా లోకేష్ ను ప్రజలను ఉద్దేశించి మాట్లాడవద్దని పోలీసులు చెప్పడం చర్చనీయాంశం అవుతుంది. పాదయాత్ర చేస్తోంది.. ప్రజలతో మాట్లాడటానికి వారినుద్దేశించి ప్రసంగించడానికి కానీ పోలీసులు మాత్రం .. మైకులు లాక్కోవడం.. స్టూల్స్ లాగేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో విస్తృత చర్చకు కారణం అవుతున్నాయి. గతంలో పాదయాత్రలు చేసిన వారు ఎలా చేశారు.. అప్పుడు పోలీసులు ఎలా స్పందించారు.. ఇప్పుడు పోలీసులు ఎలా వ్యవహరిస్తున్నారన్నది విశ్లేషణ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం తీరుపై వ్యతిరేక వ్యాఖ్యలు వినిపించడానికి కారణం అవుతోంది. వె?ఎస్ఆర్సీపీ సోషల్ మీడియా లోకేష్ పాదయాత్రపై విస్తృతంగా వ్యతిరేక ప్రచారం చేస్తోంది. జనాలు లేరని.. లోకేష్ నడవలకేపోతున్నారని.. మాటల్లో తడబడుతున్నారని పోస్టులు పెడుతున్నారు. దీని కింద టీడీపీ నేతలు తాము చెప్పాలనుకున్నది చెబుతున్నారు. కౌంటర్లు ఇస్తున్నారు. అదే సమయంలో వైసీపీ పార్టీ నేతలు రోజుకు కనీసం నలుగురు, ఐదుగురు అయినా మీడియా ముందుకు ఘాటు విమర్శలు చేస్తున్నారు. ఇంతగా ఎదురుదాడి చేస్తున్నారంటే.. పాదయాత్ర సక్సెస్ అయినట్లని టీడీపీ నేతలు విశ్లేషిస్తున్నారు. సాధారణం ఎక్కడైనా సాఫీగా సాగితే వచ్చే ప్రచారం కన్నా ఆటంకాలు ఏర్పడితే వచ్చే ప్రచారం ఎక్కువ. ప్రస్తుతం లోకేష్ పాదయాత్ర విషయంలో అదే జరుగుతోందన్నది రాజకీయవర్గాల అంచనా.

## శ్రీశైలం బ్రహ్మగుండం స్పెషల్ బస్సులు

డోన్ శ్రీశైలం, బ్రహ్మగుండంకు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా డోన్ డిపో నుండి శ్రీశైలం మరియు బ్రహ్మగుండం శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపబడును అనీ డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశి భూషణ్ తెలిపారు, స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం మాట్లాడుతూ శ్రీశైలానికి దాదాపుగా 20 బస్సులు మరియు బ్రహ్మగుండంకు 10 బస్సులు నడుపుటకు ఏర్పాట్లు చేసాం,బస్సు చార్జీలు డోన్ నుండి శ్రీశైలం చార్జీ 430 రూపాయిలు, కర్నూలు నుండి శ్రీశైలం చార్జీ 350 రూపాయిలు, కర్నూల్ నుండి వెంకటాపురం చార్జీ 150 రూపాయలు ,డీజిల్ రేట్లు పెరిగిన కూడా, పోయిన సంవత్సరపు పాత చార్జీలనే నిర్ణయించడం జరిగింది, అదేవిధంగా శ్రీశైలం వెళ్లే భక్తులు శ్రీశైలంకు రిజర్వేషన్ చేసుకునే సమయంలోనే, రిజర్వేషన్ టికెట్ తో పాటుగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనం టికెట్లు పొందుటకు తేదీ 11.02.2023 నుండి అవకాశం కల్పించడం జరిగింది,దీనిలో భాగంగా అతి శీఘ్ర దర్శనం, సీఘ్రదర్శనం టికెట్లు జారీ చేయబడును, త్వరలో స్పర్శ దర్శనం టికెట్లు కూడా జారీ చేయబడతాయి, కావున భక్తాదులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవలసినదిగా కోరడమైనది అనీ డిపో మేనేజర్ శశి భూషణ్ తెలిపారు.

## సంఘ సంస్కర్త, ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి

-నేడు ఆయన జయంతి

19వ శతాబ్దపు ప్రముఖ భారతీయ సంఘసంస్కర్తలలో ఒకరైన దయానంద సరస్వతి ఫిబ్రవరి 12, 1824న గుజరాత్‌లోని టంకర గ్రామంలో జన్మించారు. ఈయన అసలుపేరు మూలశంకర్. వేద సంప్రదాయంలో హిందూసంస్కృతిని పరిరక్షించడంలో కృషిచేయడమే కాకుండా 1975లో అర్యసమాజ్ అనే సంస్థను స్థాపించి ప్రసిద్ధి చెందినాడు. ఈయన గురువు విరజానందస్వామి. భారతదేశం భారతీయులకే అనే స్వరాజ్ నినాదాన్ని మొదటిసారిగా ప్రవచించినది ఈయనే.ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లాడు. ఈ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందాడు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథురలోని స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరుకున్నాడు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలుదేరాడు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నాడు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది, ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన భారతదేశం ఆ స్మయంలో అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులెడుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగుచున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసిచలించి పోయాడు. భారత దేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టాడు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించాడు. స్త్రీ విద్య పరిచయం చేసాడు. మేడంకామా, గురుదత్ విద్యార్థి, వినాయక్ దామోదర్ సావర్కార్, లాలా హర్‌దయాళ్, మదన్‌లాల్ ధింగ్రా, రాంప్రసాద్ బిస్మల్, మాహాదేవ గోవిందరనడే, స్వామి శ్రద్ధానంద, మహాత్మా హంసరాజ్, లాలా లజపతిరాయ్ తదితరులు ఈయనచే ప్రభావితులైనవారు. ఈయన రచించిన సత్యార్థ ప్రకాష్ గ్రంథం సుప్రసిద్ధమైనది. మతమార్పిడిలు చేసిన వారిని తిరిగి హిందూమతంలోకి రప్పించడానికి శుద్ధిఉద్యమాన్ని ప్రారంభించారు. 30 అక్టోబరు, 1883న దయానంద సరస్వతి మరణించారు.

## నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

నెల్లూరు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. రెండు ఫైర్ ఇంజన్లు తో అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలని అదుపు లోకి తెచ్చారు. ఈరోజు రెండో శనివారం కార్యాలయానికి సెలవుకావడంతో సిబ్బంది ఎవరూ లేరు.ఈ అగ్ని ప్రమాదంలో ఏ ఏ ఫైళ్లు దగ్ధం అయ్యాయి, ఎంతవరకు నష్టం కలిగిందని అనే అంశాలు తెలియాల్సి ఉంది. ఇప్పటికే నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గతంలో రెండుసార్లు అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది తెలిసిందే. కోట్ల రూపాయల కుంభకోణాలకు సంబంధించి అనేక కేసులకు సంబంధించిన ఫైళ్లు దగ్ధం అవ్వగా నేడు జరిగిన అగ్నిప్రమాదం లో ఏమి ఫైల్ తగలబడ్డాయో,ఏమి నష్టం జరిగిందో విచారణలో తెలియాల్సి ఉంది...

## పోలవరం ప్రాజెక్టులో ఫుడ్ పాయిజన్

70 మంది ఆసుపత్రి పాలు

పోలవరం ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టులో ఫుడ్ పాయిజన్ అయ్యి సుమారు 70 మంది పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో నలుగురికి అస్వస్థత గురయ్యారు. శుక్రవారం రాత్రి బాధితులు తిన్న నే భోజనం కలుషితం కారణంగా విరోచనాలు వాంతులు అయ్యాయని కార్మికులు చెబుతున్నారు. ఈ విషయంపై డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ దీనివల్ల కార్మికులు అస్వసతకు గురయ్యారు అనే విషయాన్ని పూర్తిగా పరిశీలించిన తర్వాత చెబుతామని అన్నారు.ఈ విషయం తెలుసుకున్న పోలవరం డిఎస్పి లతా కుమారి పోలవరం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి డాక్టర్ తో మాట్లాడారు. అసలు ఏం జరిగింది ఎందుకు ఇంత మంది కార్మికులు ఒక్కసారిగా అస్వస్థత కు గురయ్యారని అడిగి తెలుసుకున్నారు.

## 13 న కలిదిండిలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు ఫిబ్రవరి 11: ఏలూరు జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం కలిదిండి మండల కేంద్రమైన కలిదిండి నందలి శ్రీ కళ్యాణి ఫంక్షన్ హాల్ లో ఫిబ్రవరి 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు అందరూ కలిదిండి స్పందన కార్యక్రమం లో పాల్గొంటారని ఆయన అన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం ఫిబ్రవరి 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## శ్రీశైలం పాదయాత్రికులకు ఉచిత అన్నదాన కార్యక్రమం

నందికొట్కూరు మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి కాలినడకన వెళుతున్న శివ స్వాములకు, పాదయాత్రికులకు యూకేఆర్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నందికొట్కూరు పట్టణంలో ఎన్టీఆర్ జలాశయం సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాని వైసీపీ నాయకులు కౌన్సిలర్ ఉండవల్లి ధర్మా రెడ్డి, బ్రాహ్మణ కొట్కూరు వైసీపీ యువ నాయకులు బిజ్జుల ఉదయ్ కిరణ్ రెడ్డి, పగిడ్యాల వైసీపీ నాయకులు గంగిరెడ్డి ఉదయ్ కిరణ్ రెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో యూకేఆర్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. శనివారం నుండి 15 వ తేదీ బుధవారం వరకు ఐదు రోజుల పాటు శ్రీశైలానికి కాలినడకన వెళ్ళే భక్తులకు, శివ స్వాములకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో యూకేఆర్ యూత్ సభ్యులు రాజేష్, బోరింగ్ మద్దిలేటి, విజయ భాస్కర్, కిరణ్, తిరుమలేష్, రవి, వెంకటేశ్వర్లు, మధు, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

